క్లుప్తంగా

సన్నబియ్యం పంపిణీపై సమీక్ష



సమావేశంలో తహసీల్దార్లు

మద్దూరు(హుస్నాబాద్): ఉగాది నుంచి ప్రభుత్వం చేపట్టనున్న సన్నబియ్యం పంపిణీపై మద్దూరు, దూళ్మిట్ట మండలాల తహసీల్దార్ కార్యాలయాల్లో ఎమ్మార్వోలు ఏజీ రహీం, సింహాచలం, మధుసూదన్ ఆధ్వర్యంలో సోమవారం సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ వచ్చేనెల నుంచి రేషన్ కార్డుదారులందరికీ సన్నబియ్యాన్ని మాత్రమే పంపిణీ చేయాలన్నారు. దొడ్డు బియ్యం పంపిణీ చేయొద్దని, ఉపేక్షిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. కార్యక్రమంలో ఆర్ఐలు రమేశ్, రవీందర్, అన్వర్, డీలర్లు పాల్గొన్నారు.

పెద్దమ్మ తల్లికి ఏసీపీ పూజలు



ఏసీపీ, సీఐని సన్మానిస్తున్న నిర్వాహకులు

ప్రశాంత్‌నగర్(సిద్దిపేట): పెద్దమ్మ తల్లి ఆశీస్సులతో ప్రజలందరికీ మంచి జరగాలని సిద్దిపేట ఏసీపీ మధు ఆకాంక్షించారు. జిల్లా కేంద్రంలోని హనుమాన్ నగర్ పెద్దమ్మ ఆలయ ప్రథమ వార్షికోత్సవం సందర్భంగా టూ టౌన్ సీఐ ఉపేందర్‌తో కలిసి ఆయన సోమవారం దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ నిర్వాహకులు వారికి తీర్థప్రసాదాలు అందించారు. కార్యక్రమంలో ముదిరాజ్ సంఘ సభ్యులు తిరుపతి, రాజేశ్, బాలయ్య, యాదగిరి, యాట రాజేశ్, యమధర్మ రాజు, మనోజ్, మహేశ్ తదితరులు పాల్గొన్నారు.

చలివేంద్రం ప్రారంభం



చలివేంద్రాన్ని ప్రారంభిస్తున్న నాగేందర్

చేర్యాల(సిద్దిపేట): పట్టణ కేంద్రానికి వచ్చే వివిధ గ్రామాల ప్రజలకు వేసవిలో దాహం తీర్చేందుకు గాను ఏర్పాటు చేసిన చలివేంద్రాన్ని మున్సిపల్ కమిషనర్ నాగేందర్ సోమవారం ప్రారంభించారు. స్థానిక అంగడి బజారు వద్ద మాజీ మంత్రి స్వర్గీయ నిమ్మ రాజారెడ్డి జ్ఞాపకార్థం మనవడు నిమ్మ నిఖిల్ రెడ్డి చలివేంద్రాన్ని ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా కమిషనర్ నిఖిల్‌రెడ్డిని అభినందించారు. కార్యక్రమంలో నిమ్మ అనిత శ్రీనివాస్‌రెడ్డి, మున్సిపల్ సీనియర్ అసిస్టెంట్ కృష్ణ, సిబ్బంది పాల్గొన్నారు.

టీబీ నివారణ దినోత్సవ ర్యాలీ



ర్యాలీలో పాల్గొన్న ఆశా కార్యకర్తలు

చేర్యాల(సిద్దిపేట): మండల పరిధిలోని గుర్జకుంటలో నెహ్రూ యువ కేంద్రం సహకారంతో ప్రపంచ టీబీ నివారణ దినోత్సవ ర్యాలీ నిర్వహించారు. వివేకానంద వెల్ఫేర్ యూత్ ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో టీబీ నివారణపై ప్రజలకు అవగాహన కల్పించారు. టీబీ లక్షణాలు కలిగిన వారిని ఆశా కార్యకర్తలు గుర్తించి ఆరోగ్య కేంద్రానికి వెళ్లమని సూచించారు. ఏఎన్ఎం, ఆశా కార్యకర్తలు, యూత్ సభ్యులు పాల్గొన్నారు.

కారుణ్య నియామకాలు



నియామక పత్రం అందజేస్తున్న అశోక్‌కుమార్

ప్రశాంత్‌నగర్(సిద్దిపేట): పశువైద్య, పశుసంవర్ధకశాఖలో పలువురికి కారుణ్య నియామక పత్రాలను అందించారు. ఆ శాఖ కార్యాలయంలో జాయింట్ డైరెక్టర్ అశోక్‌కుమార్ ఆధ్వర్యంలో చౌదరి కల్యాణ్, నీరటి విజయ్‌కుమార్‌కు సోమవారం పత్రాలను అందజేశారు.

మక్తలో కోటి తలంబ్రాల దీక్ష

వర్గల్(గజ్వేల్): వర్గల్ మండలం చాంద్‌ఖాన్ మక్త గ్రామంలో సోమవారం శ్రీరామకోటి భక్త సమాజం వ్యవస్థాపక అధ్యక్షుడు రామకోటి రామరాజు ఆధ్వర్యంలో కోటి తలంబ్రాల దీక్ష నిర్వహించారు. గ్రామంలోని కొందరు భక్తులు గోటితో వడ్లను ఒలిచి రామరాజుకు అందజేశారు.

‘హద్దు’లు దాటుతున్న ‘రేషన్’ దందా

పేదల ఆకలితీర్చే ఉద్దేశ్యంతో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అందజేస్తున్న రేషన్ బియ్యం పథకం పక్కదారి పడుతోంది. బియ్యాన్ని కొందరు దళారులు దర్జాగా ఇతర రాష్ట్రాలకు తరలించి అక్రమంగా ఆర్జిస్తున్నారు. మూడు పువ్వులు ఆరుకాయలు అన్న చందంగా చీకటి వ్యాపారం జోరుగా సాగుతోంది. అధికారుల నిఘా కరువైందని విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.

- పేదోడి బియ్యం పక్కదారి
- పట్టుబడుతున్నా ఆగని అక్రమాలు
- యథేచ్ఛగా ఇతర రాష్ట్రాలకు తరలింపు
- క్షేత్రస్థాయిలో కరువైన నిఘా

అక్కన్నపేట(హుస్నాబాద్): నియోజకవర్గంలోని అక్కన్నపేట, హుస్నాబాద్, కోహెడ, మద్దూరు మండలాల్లో రేషన్ బియ్యం వ్యాపారం జోరుగా సాగుతోంది. పలు చోట్ల అక్రమంగా తరలిస్తుండగా చాలాసార్లు పోలీసులు స్వాధీనం చేసుకొని బాధ్యులపై కేసులు నమోదు చేశారు. అయినా అక్రమ వ్యాపారం ఆగడం లేదు. ఏది ఏమైనా ఉచిత బియ్యం పథకం లక్ష్యం నీరుగారుతోంది.

కిలో రూ.10 నుంచి 16 వరకు

అక్కన్నపేట మండలంలో 24 రేషన్ దుకాణాలు, సుమారుగా 12,536 రేషన్ కార్డులుండగా, వాటి ద్వారా 35,974మంది లబ్ధిదారులున్నారు. ప్రతి నెలా సుమారుగా 2,285 కిలోల బియ్యం సరఫరా జరుగుతోంది. కొంత మంది దళారులు ప్రతినెలా రేషన్ బియ్యాన్ని కిలో రూ.10 నుంచి రూ.16 వరకు ఖరీదుచేసి పెద్ద వ్యాపారస్తులకు విక్రయిస్తున్నారు. కొన్ని నెలలుగా రేషన్ బియ్యం దందా జోరుగా సాగుతోంది. ఇటీవల మండలంలోని గోవర్ధనగిరి గ్రామంలో రెవెన్యూ, పోలీసులు సంయుక్తంగా అక్రమంగా నిల్వ చేసిన ఏడు క్వింటాళ్ల రేషన్ బియ్యాన్ని సీజ్‌చేసి, కేసులు నమోదు చేసిన ఘటనలున్నాయి. అలాగే మల్లంపల్లితో పాటు తదితర గ్రామాల్లో కూడా అక్రమంగా తరలిస్తున్న రేషన్ బియ్యాన్ని పోలీసులు స్వాధీనం చేసుకొన్నారు.



గోవర్ధనగిరిలో రేషన్ బియ్యం నిల్వను స్వాధీనం చేసుకున్న రెవెన్యూ, పోలీసు సిబ్బంది(ఫైల్)

ఇతర రాష్ట్రాలకు రవాణా

అక్కన్నపేట మండలం జనగామ జిల్లాలోని తరిగొప్పుల, నర్మెట మండలాల సరిహద్దుగా ఉండటంతో అక్రమార్కులకు కలిసి వస్తోంది. కొంత మంది దళారులు రేషన్ బియ్యాన్ని జనగామ జిల్లా మీదుగా మహారాష్ట్ర, కర్ణాటక తదితర రాష్ట్రాలకు తరలించి కాసులు దండుకుంటున్నారు. దీనికి ప్రధాన కేంద్రంగా అక్కన్నపేట మండలంలోని మారుమూల గ్రామాలు, పల్లెలు, తండాల్లో రాత్రి పూట రేషన్ బియ్యాన్ని కొనుగోలుచేసి అక్కడే నిల్వ చేసి తరలిస్తున్నట్లు విశ్వసనీయ సమాచారం. ఈ వ్యాపారం ఎవరు చేస్తున్నారు. ఎవరి ప్రమేయం ఉంది. అనేది తెలియడంలేదు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు దృష్టిసారించి రేషన్ బియ్యం దందాను అరికట్టాలని పలువురు కోరుతున్నారు.

కఠిన చర్యలు తీసుకొంటాం



ఇటీవల గోవర్ధనగిరిలో అక్రమంగా నిల్వ చేసిన రేషన్ బియ్యం సీజ్‌చేసి, కేసు నమోదు చేశాం. పేదోడి బియ్యం అక్రమంగా తరలిస్తే తప్పకుండా కఠిన చర్యలు తీసుకుంటాం. గ్రామాల్లో ఎవరైనా రేషన్ బియ్యం విక్రయిస్తున్నట్టు సమాచారం ఉంటే తెలియజేయాలి.

– అనంతరెడ్డి, తహసీల్దార్, అక్కన్నపేట మండలం



అల్లీపూర్‌లో ఇళ్ల పట్టాలు చూపుతూ నిరసన వ్యక్తం చేస్తున్న ఎస్సీ కాలనీవాసులు

ఇంటి స్థలాలు లాక్కొంటున్నారు

అల్లీపూర్ ఎస్సీ కాలనీ వాసులు

చిన్నకోడూరు(సిద్దిపేట): తమకు ప్రభుత్వం ఇచ్చిన ఇళ్ల స్థలాలను లాక్కొంటున్నారని, అధికారులకు మొరపెట్టుకున్నా ఫలితం లేదని మండల పరిధిలోని అల్లీపూర్ ఎస్సీ కాలనీ వాసులు ఆవేదన వ్యక్తం చేశారు. తమ ఇళ్ల పట్టాలతో సోమవారం నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సర్వే నంబరు9లో 0.35 గుంటలు, సర్వే నంబరు 261లో 0.37 గుంటల భూమిని గ్రామానికి చెందిన తడిసిన సురేందర్‌రెడ్డి వద్ద కొనుగోలుచేసి 1994లో పట్టాలు పంపిణీ చేశారన్నారు. తహసీల్దార్ కార్యాలయంలో ప్రొసీడింగ్ లేక నంబర్ హెచ్,4379–94 ద్వారా ఎస్సీలకు ఇచ్చారని చెప్పారు. అయితే సురేందర్‌రెడ్డి మృతి చెందడంతో ఆ స్థలం అతడి భార్య శైలజ పేరు మీదకు వచ్చిందని, రికార్డుల్లో ప్రస్తుతం వారి పేరు వస్తుందని తెలిపారు. ఇచ్చిన భూములు లాక్కోవడానికి పట్టాదారు ప్రయత్నాలు చేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. అధికారులు స్పందించి తమ సమస్యను పరిష్కరించాలని కోరారు. ఈ విషయమై తహసీల్దార్ హరికిరణ్‌ను వివరణ కోరగా ఎస్సీ కాలనీ వాసులకు ప్రభుత్వం ఇచ్చింది వాస్తవమేనన్నారు. ప్రభుత్వం ఇచ్చిన స్థలాన్ని ఎస్సీలకు ఇచ్చి, మిగులు స్థలాన్ని రైతుకు అప్పగిస్తామని, వారంలోగా సమస్య పరిష్కరిస్తామని చెప్పారు.

పంట నష్టం ప్రభుత్వానికి పట్టదా?

మాజీ ఎమ్మెల్యే బాలకిషన్

బెజ్జంకి(సిద్దిపేట): అకాల వర్షాలతో రైతులు పంటలు నష్టపోతే ప్రభుత్వానికి, స్థానిక ఎమ్మెల్యేకు పట్టింపే లేదని మానకొండూర్ మాజీ ఎమ్మెల్యే రసమయి బాలకిషన్ అన్నారు. ఇటీవల వర్షాలకు బెజ్జంకి, రామసాగరం గ్రామాలకు చెందిన కల్లూరి రమేశ్, అడుకని రమేశ్, రవికి చెందిన మొక్కజొన్న పంటను సోమవారం ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ నష్టపోయిన రైతులను గుర్తించి వెంటనే ఆదుకోవాలన్నారు. అనంతరం బేగంపేటలో ఇటీవల మృతి చెందిన బీఆర్ఎస్ నాయకుడు లక్ష్మణ్ కుటుంబాన్ని పరామర్శించారు.



నేలవాలిన పంటను పరిశీలిస్తున్న బాలకిషన్

ఆయా కార్యక్రమాలలో మహిపాల్‌రెడ్డి, లక్ష్మణ్, తిరుపతి, శ్రీనివాస్‌గుప్త, బండి రమేశ్, సంజీవరెడ్డి, తిరుపతిరెడ్డి, శేఖర్‌బాబు, మల్లేశం, నరేశ్, రాములు, మహేశ్, స్వామి పాల్గొన్నారు.

ఏఐ ఆధారిత బోధనతో మెరుగైన నైపుణ్యం

ఎంఈఓ సత్తయ్య

కొండపాక(గజ్వేల్): ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్(ఏఐ) ఆధారిత బోధనతో భాషా నైపుణ్యాలు మరింత మెరుగుపడతాయని మండల విద్యాధికారి(ఎంఈఓ) బచ్చలి సత్తయ్య అన్నారు. కుకునూరుపల్లి మండలంలోని తిప్పారం ప్రాథమిక పాఠశాలలో ఏఐ ఆధారిత బోధన తీరును సోమవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ బోధన వల్ల విద్యార్థుల్లో మరింత ఆసక్తి, అవగాహన పెరుగుతుందన్నారు.అనంతరం మేదినీపూర్‌లోని ప్రాథమికోన్నత పాఠశాలను సందర్శించారు. రికార్డులు, మధ్యాహ్న భోజన పథకం అమలును పరిశీలించారు. పాఠశాల నిర్వహణ విషయాలపై ఉపాధ్యాయులకు పలు సూచనలు చేశారు. కార్యక్రమంలో హెచ్ఎం చీల రవి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.



బోధన తీరును పరిశీలిస్తున్న ఎంఈఓ సత్తయ్య

సీసీ రోడ్డు పనులు ప్రారంభం



భూమిపూజ చేస్తున్న నాయకులు

సిద్దిపేటరూరల్: మండల పరిధిలోని బచ్చాయిపల్లిలో రూ.10లక్షల ఉపాధి హామీ నిధులతో సీసీ రోడ్డు నిర్మాణానికి సోమవారం పనులు ప్రారంభించారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ గ్రామాలను అభివృద్ధి చేసేందుకు రోడ్ల నిర్మాణం చేపట్టామన్నారు. కార్యక్రమంలో నాయకులు మల్లయ్య, రాములు, ఎల్లయ్య, రాములు, యాదగిరి, వెంకటి, సంయొద్దీన్, శ్రీనివాస్, చందు, మహేందర్, ప్రశాంత్ తదితరులు పాల్గొన్నారు.

కడవేర్గులో..

చేర్యాల(సిద్దిపేట): మాజీ ఎమ్మెల్యే, జనగామ నియోజకవర్గ ఇన్‌చార్జి కొమ్మూరి ప్రతాప్‌రెడ్డి చొరవతోనే సీసీ రోడ్ల నిర్మాణానికి నిధులు మంజూరయ్యాయని కాంగ్రెస్ మండల నాయకులు రమేశ్, వినీత్‌బాబు అన్నారు. మండల పరిధిలోని కడవేర్గులో రూ.10 లక్షల ఎన్ఆర్ఈజీఎస్ నిధులతో చేపడుతున్న సీసీ రోడ్డు పనులను సోమవారం వారు ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ పనులు త్వరగా పూర్తయ్యేందుకు చర్యలు తీసుకుంటున్నారన్నారు. బాలచంద్రం, నర్సయ్య, ఎండీ. నాజర్, యాదగిరి, వెంకటేశ్, అంజయ్య, ముత్తయ్య, స్వామి, కనకయ్య, సాంబయ్య పాల్గొన్నారు.

ఎంపీ సహకారంతో..

తొగుట(దుబ్బాక): ఎంపీ రఘునందన్‌రావు సహకారంతో గ్రామాల్లో అభివృద్ధి పనులు చేపట్టామని బీజేపీ మండల అధ్యక్షుడు చంద్రం తెలిపారు. మండలంలోని వెంకట్రావుపేటలో రూ.10 లక్షలతో సీసీరోడ్డు నిర్మాణ పనులను సోమవారం చేపట్టారు. రాంరెడ్డి, నర్సింహులు, రవికుమార్, పెంటోజీ, స్వామిగౌడ్, నరేశ్, మురళి, పెంటయ్య తదితరులు పాల్గొన్నారు.

• పెద్ద పండుగ సందడి



ఇంద్రగూడెంలో పూజలు చేస్తున్న కురుమ కులస్తులు

కురుమ కులస్తులు వారం రోజుల పాటు ఘనంగా నిర్వహించుకునే పెద్ద పండుగ వేడుకలు జిల్లాలోని పలు గ్రామాల్లో జోరుగా కొనసాగుతున్నాయి. శుక్రవారం నుంచి మళ్లీ శుక్రవారం వరకు ప్రతిరోజు బీర్నోళ్లు(ఒగ్గు పూజారులు) బీరప్ప స్వామి, కామరాతి దేవిని ఘనంగా పూజిస్తారు. దీంతో కురుమల ఇళ్లు బంధువులు, మిత్రులతో సందడితో నిండాయి. అందులో భాగంగా సిద్దిపేట రూరల్ మండలం ఇంద్రగూడెంలో కురుమలు ప్రత్యేక పూజలు నిర్వహించారు.

– ప్రశాంత్‌నగర్(సిద్దిపేట):

డ్రంకెన్ డ్రైవ్‌లో ఒకరికి జైలు

గజ్వేల్‌రూరల్: డ్రంకెన్ డ్రైవ్‌లో పట్టుబడిన ఓ వ్యక్తికి నాలుగు రోజుల జైలుశిక్ష విధించినట్టు ట్రాఫిక్ సీఐ మురళి చెప్పారు. ఇటీవల నిర్వహించిన వాహన తనిఖీల్లో 11 మంది మద్యం తాగి వాహనాలను నడుపుతూ పట్టుపడ్డారు. వారిని సోమవారం కోర్టులో హాజరుపర్చగా న్యాయమూర్తి ప్రియాంక 11 మందికి రూ.6,600 జరిమానాతో పాటు ఒకరికి నాలుగు రోజుల జైలుశిక్ష విధించినట్లు తెలిపారు.

సిద్దిపేటలో..

పట్టణంలో వారం రోజుల క్రితం నిర్వహించిన వాహన తనిఖీల్లో పట్టుపడిన పది మందికి న్యాయమూర్తి రూ.14,500 జరిమానా విధించినట్లు ట్రాఫిక్ సీఐ ప్రవీణ్‌కుమార్ తెలిపారు.

దుకాణాల్లో తనిఖీలు

హుస్నాబాద్: గంజాయి, ఇతర మత్తుపదార్థాలపై పటిష్టమైన నిఘా ఏర్పాటు చేశామని ఎస్ మహేశ్ అన్నారు. అనుమానస్పద ప్రాంతాల్లో సోమవారం రాత్రి నార్కొటిక్స్ డాగ్స్‌తో తనిఖీలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మత్తు పదార్థాలు కలిపిన చాక్లెట్లు ఎవరైనా కలిగి ఉన్నా, అమ్మినా కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు.

హుండీ ఆదాయం లెక్కింపు

బెజ్జంకి(సిద్దిపేట): లక్ష్మీనర్సింహస్వామి దేవాలయ హుండీ ఆదాయం రూ.1,46,266 వచ్చినట్లు ఆలయ కమిటీ చైర్మన్ జెల్ల ప్రభాకర్ తెలిపారు. ఎండోమెంట్ సూపర్‌వైజర్ విజయలక్ష్మి సమక్షంలో సోమవారం హుండీ ఆదాయాన్ని లెక్కించారు. కార్యక్రమంలో ఏట శర్మ, పూజారి మధుసూదనాచారి, డైరెక్టర్లు బెజుగం ప్రసాద్, ఐలేని జయ, చంద్రం, సునీత పాల్గొన్నారు.

మంత్రి పొన్నం రూ.లక్ష విరాళం

కోహెడ(హుస్నాబాద్): స్థానిక అయ్యప్ప ఆలయ నిర్మాణానికి మంత్రి పొన్నం ప్రభాకర్ రూ.1లక్ష విరాళం అందించినట్లు అయ్యప్ప సేవా సమితి అధ్యక్షుడు ఖమ్మం రమేశ్ సోమవారం తెలిపారు. ఆయన మాట్లాడుతూ తమ సేవా సమితి అభ్యర్థన మేరకు మొదటి విడతగా మంత్రి ఆ విరాళాన్ని ఎస్‌బీఐ ఖాతాలో జమ చేశారన్నారు. ఈ సందర్భంగా మంత్రికి ఆయన ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.

అక్రమ అరెస్టులతో ఆపలేరు

దుబ్బాకటౌన్: అక్రమ అరెస్టులతో ఆశా వర్కర్ల పోరాటాన్ని ఆపలేరని సీఐటీయూ జిల్లా కోశాధికారి భాస్కర్ అన్నారు. సమస్యల సాధన కోసం సోమవారం జరగనున్న ధర్నా కోసం హైదరాబాద్ వెళ్తున్న ఆశా వర్కర్లను పోలీసులు అరెస్టు చేయడం దారుణం అన్నారు. కార్యక్రమంలో ఆశా వర్కర్లు దేవలక్ష్మి, వసుంధర, బాబాయి, లత, పాల్గొన్నారు.

నర్సరీలతో మహిళలకు స్వయం ఉపాధి



మొక్కలను పరిశీలిస్తున్న శ్రీనివాస్‌రెడ్డి

మున్సిపల్ కమిషనర్ శ్రీనివాస్‌రెడ్డి

దుబ్బాక: స్వయం సహాయక మహిళా సంఘాల బలోపేతం కోసం నర్సరీల నిర్వహణను మహిళా సంఘాలకు అప్పగించారని మున్సిపల్ కమిషనర్ శ్రీనివాస్‌రెడ్డి చెప్పారు. చెల్లాపూర్ 2, 3వ వార్డులలో మహిళా సంఘాలు నిర్వహిస్తున్న నర్సరీలను సోమవారం ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ చెల్లాపూర్, ధర్మాజీపేట, మల్లాయపల్లి వార్డులలో ఐదు నర్సరీల్లో వార్డుకు 5 వేల మొక్కల చొప్పున 25 వేల మొక్కలు పెంచేందుకు మహిళ సంఘాలతో నర్సరీలు ఏర్పాటు చేయించారన్నారు. ఈ నర్సరీల్లో పెంచే మొక్కలను రూ.10 చొప్పున తామే కొనుగోలు చేసి వచ్చే వానాకాలంలో మున్సిపాల్టీలో నాటుతామని, ప్రజలకు కూడా పంపిణీ చేసేందుకు ప్రణాళిక రూపొందిస్తామని చెప్పారు. అనంతరం రెండో వార్డులో మిషన్ భగీరథ నీటిసరఫరాపై ఆరా తీశారు. కార్యక్రమంలో వర్క్ ఇన్‌స్పెక్టర్ బుస్స ప్రవీణ్, మెప్మా సీఓ రేణుక, ఆర్పీలు ఉన్నారు.

సీసీ రోడ్డు కోసం మహిళల నిరసన

చేర్యాల(సిద్దిపేట): మండల పరిధిలోని ముస్త్యాల గ్రామం ఏడో వార్డులో సీసీ రోడ్డు నిర్మించాలని పలువురు మహిళలు సోమవారం నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఎన్ఆర్ఈజీఎస్ నిధులు కేటాయించాలని రెండు సంవత్సరాల క్రితమే పంచాయతీలో తీర్మానం చేశారన్నారు. తమకు రోడ్డు కేటాయించక పోవడం ఏమిటని ప్రశ్నించారు. మండల నాయకులు పునరాలోచించి రోడ్డును వేయించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో లత, భాగ్యమ్మ, పద్మ, మధురమ్మ, భావన, రజిత, దేవేంద్ర, లక్ష్మి, రాజమణి తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న మహిళలు

పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం



ఆత్మీయ సమ్మేళనంలో పాల్గొన్న పూర్వ విద్యార్థులు

మిరుదొడ్డి(దుబ్బాక): మిరుదొడ్డి ఉన్నత పాఠశాలలో 1981–82 పదోతరగతి చదివిన పూర్వ విద్యార్థులు సోమవారం ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు. 43 యేళ్ల తర్వాత మిరుదొడ్డిలో కలిసి సందడి చేశారు. తమకు విద్యా బోధన చేసిన గురువులను ఘనంగా సన్మానించి సత్కరించారు.

సంక్షిప్త వార్తలు

◆ **పౌష్టికాహారంతోనే సంపూర్ణ ఆరోగ్యం**

గజ్వేల్‌రూరల్: పౌష్టికాహారం తీసుకోవడం ద్వారానే సంపూర్ణ ఆరోగ్యవంతులుగా ఉంటారని ప్రముఖ వైద్యుడు నరేశ్‌బాబు అన్నారు. పట్టణంలోని ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాలలో సోమవారం ఎన్ఎస్ఎస్ యూనిట్‌ల ఆధ్వర్యంలో ఆరోగ్య సంరక్షణ–ప్రథమ చికిత్స అనే అంశంపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. వైస్ ప్రిన్సిపాల్ కమలా క్రిస్టియాన, ఐక్యూఏసీ కోఆర్డినేటర్ లక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

◆ **ఫసల్ బీమా అమలు చేయండి**

గజ్వేల్‌రూరల్: రాష్ట్రంలో ప్రధానమంత్రి ఫసల్ బీమా యోజన పథకాన్ని వెంటనే అమలు చేయాలని బీజేపీ కిసాన్‌మోర్చా నాయకులు డిమాండ్ చేశారు. ఇటీవల కురిసిన వర్షాలకు దెబ్బతిన్న పంటలను సోమవారం పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ నష్టపోయిన రైతుకు ఎకరాకు రూ.40 వేలు పరిహారం అందించాలన్నారు. కార్యక్రమంలో రాంరెడ్డి, జశ్వంత్‌రెడ్డి, 0వెంకట్‌రెడ్డి, రాజిరెడ్డి, మహేశ్, ఉమ, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

◆ **ప్రభుత్వ నిర్ణయం హర్షణీయం**

చిన్నకోడూరు(సిద్దిపేట): రాష్ట్రంలో 50 మందికి పైగా విద్యార్థులు ఉన్న ప్రతి ప్రాథమిక పాఠశాలకు 5 చొప్పున కంప్యూటర్‌లు అందజేయాలనే ప్రభుత్వ నిర్ణయం హర్షణీయమని ఎస్‌జీటీ ఫోరం రాష్ట్ర కార్యదర్శి పానుగంటి నర్సింహాచారి అన్నారు. సోమవారం ఆయన మాట్లాడుతూ విద్యార్థుల సంఖ్యతో సంబంధం లేకుండా అన్ని పాఠశాలలకు కంప్యూటర్‌లు అందజేయాలని, ఉచితంగా ఇంటర్‌నెట్ సౌకర్యం కల్పించాలని కోరారు.

◆ **నేడు వారపు సంత వేలం**

కోహెడ(హుస్నాబాద్): కొత్త బస్టాండ్ వద్ద ఉన్న మూడు దుకాణాలు, నూతన కాంప్లెక్స్‌లోని 14 దుకాణాలు, అలాగే ప్రతి ఆదివారం నిర్వహించే వారపు సంతకు మంగళవారం బహిరంగ వేలం నిర్వహిస్తున్నట్లు పంచాయతీ కార్యదర్శి నాగరాజు తెలిపారు. ఆసక్తి గల వ్యాపారులు ముందుగా రూ.50 వేలు నగదుగాని, డీడీ కాని సమర్పించాలని చెప్పారు.

◆ **ఆలయ అభివృద్ధికి రూ.1,41,111 విరాళం**

కోహెడరూరల్(హుస్నాబాద్): మండలంలోని గొట్లమిట్టలో వరసిద్ధ లింగేశ్వర స్వామి ఆలయం పునర్నిర్మాణం కోసం దాత దాకూరు లింగారెడ్డి సోమవారం రూ.1,41,111 విరాళం అందజేశారు. ఆయనకు గ్రామస్తులు కృతజ్ఞతలు తెలిపారు.

◆ **అధ్యాపకుడికి గౌరవ డాక్టరేట్**

సిద్దిపేటఎడ్యుకేషన్: ప్రభుత్వ డిగ్రీ, పీజీ అటానమస్ కళాశాల జువాలజీ అధ్యాపకుడు వైకుంఠానికి గౌరవ డాక్టరేట్ లభించింది. కళారంగంలో ఆయన చేసిన సేవలను గుర్తించిన ఇంటర్నేషనల్ పీస్ యూనివర్సిటీ ఇటీవల పాండిచ్చేరిలో నిర్వహించిన ఓ కార్యక్రమంలో డాక్టరేట్ అందించింది. ఈ సందర్భంగా సోమవారం ఆయనను ప్రిన్సిపాల్ సునీత, వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ అయోధ్యరెడ్డి, సీఓఈ గోపాలసుదర్శనం, ఐక్యూఏసీ మధుసూదన్, ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం అధికారి డాక్టర్ శ్రద్ధానంద, ఇన్‌చార్జి పీడీ విశ్వనాథం అభినందించారు.

◆ **సబ్సిడీపై వ్యవసాయ పరికరాలు**

చిన్నకోడూరు(సిద్దిపేట): వ్యవసాయ పరికరాలను మహిళలకు 50 శాతం సబ్సిడీపై అందిస్తున్నారని, 26వ తేదీలోగా మహిళా రైతులు దరఖాస్తులు చేసుకోవాలని మండల వ్యవసాయ అధికారి జయంత్ కుమార్ సోమవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు.

◆ **పేద వధువుకు పుస్తె, మట్టెలు పంపిణీ**

తొగుట(దుబ్బాక): మండలంలోని ఎల్లారెడ్డిపేటకు చెందిన పేద వధువు రుచిత వివాహం సందర్భంగా మాజీ ఎంపీటీసీ వెలుపుల స్వామి ఆమెకు సోమవారం పుస్తె, మట్టెలు అందజేశారు. ఆయన మాట్లాడుతూ పేద కుటుంబాలకు తనవంతు సహాయం అందిస్తున్నానన్నారు. ఆయన వెంట ఎల్లాగౌడ్, కిషన్, రాములు, ప్రభాకర్‌రెడ్డి ఉన్నారు.

◆ **ఎల్లమ్మ హుండీ ఆదాయం రూ.92,218**

హుస్నాబాద్: రేణుకా ఎల్లమ్మ దేవాలయ హుండీ ఆదాయాన్ని సోమవారం ఆలయ ఆవరణలో లెక్కించారు. 81 రోజులకు గాను రూ.92,218 ఆదాయం సమకూరిందని నిర్వాహకులు తెలిపారు. కార్యక్రమంలో సంగారెడ్డి దేవాదాయశాఖ పరిశీలకుడు శ్రీధర్‌రెడ్డి, ఆలయ ఈఓ కిషన్‌రావు, ఆలయ కమిటీ మాజీ చైర్మన్ పూదరి లక్ష్మీనారాయణ, సిబ్బంది పరమేశ్వర శర్మ, నీల కుమారస్వామి తదితరులు పాల్గొన్నారు.

◆ **ఘనంగా జలసంరక్షణ దినోత్సవం**

వర్గల్(గజ్వేల్): స్థానిక పూలే గురుకుల మహిళా డిగ్రీ కళాశాలలో సోమవారం జల సంరక్షణ దినోత్సవం నిర్వహించారు. ప్రిన్సిపాల్ డాక్టర్ భాస్కర్‌రావు మాట్లాడుతూ ఎన్ఎస్ఎస్ వాలంటీర్లు జల సంరక్షణ ప్రాముఖ్యత గురించి ప్రజల్లోకి తీసుకెళ్లాలన్నారు. వైస్ ప్రిన్సిపాల్ గోవిందరావు మాట్లాడుతూ ప్రతి నీటి చుక్కను వృథా కానివ్వ కూడదన్నారు. కార్యక్రమంలో భాగ్యలక్ష్మి, డాక్టర్ రాధారాణి తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎన్ఎస్ఎస్ వాలంటీర్లకు సర్టిఫికెట్లు అందజేశారు.